## క్లుప్తంగా

### బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకోవాలి

వీవీపల్లి: బీసీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాలకు ఈ నెల 8 నుంచి దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ ప్రభాకర్‌శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 52 రకాల స్వయం ఉపాధి యూనిట్ల కోసం ఈ నెల 19వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. గొర్రెల పెంపకం, మినీ డెయిరీ, మోడ్రన్ పవర్ లాండ్రీ, ఆటో, టాటా ఏస్, వెదురు బుట్టల తయారీ, సెల్ ఫోన్ రిపేర్ వంటి 52 రకాల స్వయం ఉపాధి యూనిట్ల ఏర్పాటుకు రుణాలను మంజూరు చేయనున్నట్లు తెలిపారు. మండలానికి బీసీలకు 19 యూనిట్లు, ఈబీసీలకు 15 యూనిట్లు మంజూరయ్యాయని, వాటి వివరాలు సచివాలయాల్లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

### వీధి దీపాలు వెలగక ఇక్కట్లు



మర్లపాడు బస్టాండ్ ప్రాంతంలో వెలగని విద్యుత్ దీపాలు

టంగుటూరు: మండలంలోని మర్లపాడు గ్రామంలోని బస్టాండ్ ప్రాంతం అంధకారంగా మారింది. బస్టాండ్ ప్రాంతంలో విద్యుత్ దీపాలు మూడు రోజులుగా వెలగడం లేదు. దీంతో సాయంత్రం 6 గంటలు దాటితే రోడ్లన్నీ చిమ్మచీకట్లు నిండి ఉంటున్నాయి. వీధి దీపాలు వెలగకపోవడంతో వాహనదారులు, గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

### త్వరితగతిన భూ సమస్యల పరిష్కారం



ముళ్లపాడులో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ మంజునాథరెడ్డి

సీఎస్‌పురం(పామూరు): భూసమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ మంజునాథరెడ్డి అన్నారు. మండలంలోని ముళ్లపాడు, ఉప్పలపాడు గ్రామాల్లో మంగళవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వివిధ భూసమస్యల పరిష్కారం కోసం ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అధిక అర్జీలు ఆన్‌లైన్‌కోసం, సర్వేకోసం వస్తున్నట్లు తెలిపారు. వీఆర్‌ఓ మాల్యాద్రి, రెవెన్యూ సిబ్బంది, నాయకులు, పలువురు పాల్గొన్నారు.

### సబ్సిడీ యంత్రాలను సద్వినియోగం చేసుకోండి



వావిలేటిపాడులో సబ్సిడీపై అందిస్తున్న వ్యవసాయ పనిముట్లు

జరుగుమల్లి(సింగరాయకొండ): ప్రభుత్వం 40 శాతం సబ్సిడీపై కమ్యూనిటీ హైరింగ్ సెంటర్ గ్రూపులకు అందజేస్తున్న వ్యవసాయ పరికరాలు సన్నకారు రైతులకు ఎంతో ఉపయోగకరమని జిల్లా వ్యవసాయాధికారి రమేష్‌బాబు అన్నారు. జరుగుమల్లి మండలంలోని వావిలేటిపాడు, చిర్రికూరపాడు, చింతలపాలెం, పాలేటిపాడు గ్రామాల్లో కమ్యూనిటీ హైరింగ్ సెంటర్ గ్రూపులకు సబ్సిడీ వ్యవసాయ పనిముట్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. జేడీ రమేష్‌బాబు మాట్లాడుతూ వ్యవసాయ పనిముట్లను ఉపయోగించుకుని అధిక దిగుబడిని సాధించడానికి అవకాశం కలుగుతుందన్నారు. వ్యవసాయ పరికరాలపై వచ్చే అద్దెతో తీసుకున్న లోన్ చెల్లించుకోవచ్చని ఆయన వివరించారు. ఏఓ యుగంధర్‌రెడ్డి, విస్తరణఅధికారి శ్రీలేఖ, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

### స్టోన్ క్రషర్ నిర్వహణపై విచారణ



నుచ్చుపొదలో విచారణ చేస్తున్న మైనింగ్ అధికారులు

పామూరు: మండలంలోని నుచ్చుపొద వద్ద నిర్వహిస్తున్న స్టోన్ క్రషర్‌వల్ల తమ గ్రామంలో 200 కుటుంబాలు శబ్ద కాలుష్యం, దుమ్ము కాలుష్యంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, దీన్ని మూసివేయించాలని మండలంలోని నుచ్చుపొద గ్రామానికి చెందిన ప్రజలు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై మార్కాపురం మైన్స్ జియాలజిస్ట్ డి.పోలిరెడ్డి, టెక్నికల్ ఇన్‌స్పెక్టర్ బాలరాజులు మంగళవారం గ్రామంలో విచారణ చేపట్టారు. గతంలో కొన్ని రోజులు స్టోన్ క్రషర్ మూసివేశారని, మళ్లీ ఇటీవల స్టోన్ క్రషర్ పనిచేస్తోందని వారు చెప్పారు. దీనిపై విచారణ చేపట్టిన అధికారులు నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామన్నారు.

---

# రంగు మారి.. ధర దిగజారి

- అకాల వర్షాలకు దెబ్బతిన్న బర్లీ పొగాకు
- ఈ ఏడాది వెయ్యి ఎకరాల్లో సాగు
- వర్షాలతో రంగు మారిన పొగాకు
- క్వింటాకు రూ.7 వేలకు మించి పలకని వైనం
- లో గ్రేడ్ దిగుబడితో నష్టాలు తప్పవని ఆందోళన



వెంగపల్లి వద్ద పొలంలో బర్లీ పొగాకు అల్లుతున్న కూలీలు

హనుమంతునిపాడు: గత ఏడాది కురిసిన అకాల వర్షాలు రైతులను నట్టేట ముంచాయి. పంటలుకోతకు వచ్చిన సమయంలో కురిసిన అకాల వర్షాలతో చాలా పంటలు దెబ్బతిన్నాయి. కనీసం పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితులు కూడా లేదు. పొగాకు రైతులైతే కోలుకోలేకుండా దెబ్బతిన్నారు.

**విస్తారంగా సాగు..**

మండలంలో ఈ ఏడాది బర్లీ పొగాకు విస్తారంగా సాగు చేశారు. గత ఏడాది ఐటీసీ కంపెనీ మండలంలో బర్లీ పొగాకుకు క్వింటా రూ.18 వేల చొప్పున కొనుగోలు చేశారు. దీంతో ఈ ఏడాది బర్లీ పొగాకు సాగు విస్తీర్ణం బాగా పెరిగింది. ఒక్క హనుమంతునిపాడు మండలంలోనే వెయ్యి ఎకరాలకు పైగా బర్లీ సాగు చేశారు. గతంలో ఇంత విస్తీర్ణంలో రైతులు ఎప్పుడూ సాగుచేయలేదు. పెట్టుబడి, శ్రమ తక్కువ కావడం, మంచి ధర పలుకుతుండటంతో ఎక్కువ మంది రైతులు బర్లీ పొగాకు సాగుకు మొగ్గు చూపారు.

**దిగుబడిపై వర్షాల ప్రభావం**

మండలంలో ఈ ఏడాది విస్తారంగా బర్లీ పొగాకు సాగు చేశారు. అయితే గత ఏడాది చివర్లో వరుసగా వాయుగుండాలు, అల్పపీడనాలతో భారీ వర్షాలు కురిశాయి. వాయుగుండం తరువాత వరుసగా అల్పపీడనాలు ఏర్పడటంతో వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. ఈ వర్షాలు బర్లీ పొగాకు చేసిన రైతులను నట్టేట ముంచాయి. ప్రస్తుతం రైతులు పొగాకు కోసి పొలాల్లోనే పాకాలు ఏర్పాటు చేసి కర్రలు అల్లి ఆరబెడుతున్నారు. అయితే వర్షాల కారణంగా పొగాకు రంగు మారింది. దిగుబడి మొత్తం లో గ్రేడ్ వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లోగ్రేడ్ క్వింటా రూ.7 వేల నుంచి రూ.8 వేలకు మించి పలకడం లేదని చెబుతున్నారు. మొదడి గ్రేడ్ బర్లీ పొగాకుకు క్వింటా రూ.15,500 పలుకుతున్నా..ఎక్కువ శాతం లోగ్రేడ్ దిగుబడి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బర్లీ పొగాకు ఏపుగా పెరిగినా నాణ్యత లోపించడంతో నష్టాలు తప్పేలా లేవని రైతులు వాపోతున్నారు. గత ఏడాది మంచి ధర, దిగుబడి రావడంతో ఈ ఏడాది సాగు ఖర్చులు పెరిగాయి. భూమి కౌలు ఖర్చులతో పాటు కూలీ ఖర్చులు కూడా పెరిగాయి. కానీ ప్రస్తుతం లో గ్రేడ్ దిగుబడి రావడంతో నష్టాలు మూటగట్టుకునే పరిస్థితి నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. క్షం చేస్తున్నారు.కూలీలు కూడా గత ఏడాది కంటే ఈ ఏడాది రెట్టింపు అయ్యాయి. ఆశించిన ధర రాకుంటే నష్టలు తప్పవని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పాకలో ఆరబెట్టిన బర్లీ పొగాకు



ఏపుగా పెరిగిన బర్లీ సాగు పొగాకు

---

# రైతులు సస్యరక్షణ చర్యలు పాటించాలి



అలసంద పంటపై అవగాహన కల్పిస్తున్న ఏఓ ప్రకాష్‌రావు



రైతులతో మాట్లాడుతున్న ఏఓ జోత్స్నాదేవి

కనిగిరిరూరల్: రైతులు పంటల సస్యరక్షణ చర్యలు పాటించి అధిక దిగుబడులు, లాభాలు పొందాలని ఏఓ పి జోత్స్నాదేవి అన్నారు. మండలంలోని చిన అలవలపాడు, పొలవరం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఈ సందర్భంగా కంది తదితర పంటలను పరిశీలించి, రైతులకు అవగాహన కల్పించారు. కందిలో కంది పూత, మరియు పింద దశలో ఉన్నందున మారుకా మచ్చల పురుగు ఉధృతి ఎక్కువగా ఉందన్నారు. రైతులు తప్పనిసరిగా ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని సద్వినయోగం చేసుకోవాలన్నారు. వరి పంటకు ప్రీమియం కట్టేందుకు ఈనెల 15 వరకు గడువును పెంచినట్లు వివరించారు. సర్పంచ్‌లు మునగల బ్రహ్మయ్య, చిలంకూరి నాగార్జున, రైతు సేవా సిబ్బంది గాయత్రి,షబానా, రైతు నాయకులు పాల్గొన్నారు.

వీసీపల్లి: మండల పరిధిలోని మురుగమ్మి, ముద్దపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి ప్రకాష్‌రావు మాట్లాడుతూ రైతులు ఈ క్రాప్ బుకింగ్ తప్పనిసరిగా చేయాలన్నారు. అలసందలో కూడా సస్యరక్ష చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ నల్ల గంగుల శ్రీనివాస్ యాదవ్, గ్రామ సహాయకులు సాయి ప్రియ, సాయిచరణ్ రైతులు పాల్గొన్నారు.

పామూరు: వరిలో కాండం కుళ్లు తెగులుపట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయాధికారి కంచం రాధ అన్నారు. మండలంలోని మోపాడు, లక్ష్మీనరసాపురం గ్రామాల్లో మంగళవారం పొలంపిలుస్తోంది నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు సాగుచేసిన వరి, జొన్న పంటలను రైతులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఏఓ మాట్లాడుతూ వరిని ఆశించిన కాండం కుళ్లు తెగులును నివారించేందుకు ప్రొఫికోనజోల్ లేదా హెక్సాకానజోల్ లీటరు నీటికి 2 మి.లీ మందు కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. పంటలు సాగుచేసిన రైతులు బీమా నమోదు చేయించుకోవాలన్నారు. వీఏఏ జి.సంతోష్, బాలక్రిష్ణ పాల్గొన్నారు.

సీఎస్‌పురం(పామూరు): వరి సాగు చేసిన రైతులు ఈనెల 15వ తేదీలోగా ప్రధానమంత్రి ఫసల్ బీమాయోజన పథకం కోసం ప్రీమియం చెల్లించి పంటల సాగును నమోదుచేసుకోవాలని ఏఓ బి.సంపత్‌కుమార్ అన్నారు. మండలంలోని గోగులపల్లె, రామాపురం గ్రామాల్లో మంగళవారం పొలంపిలుస్తోంది నిర్వహించారు. ఈ సందర్భంగా కంది, వరి పంటలను పరిశీలించి ఆయా పంటలను ఆశించే తెగుళ్లు, నివారణ చర్యలపై వివరించారు. ఏఈఓ పావలి శ్రీనివాసులు, వీఏఏలు వెంకటేశ్వర్లు, వెంకటరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

సింగరాయకొండ: రైతులు పంటలకు ఈ క్రాప్ నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని వ్యవసాయాధికారి సుధాకర్ తెలిపారు. మండలంలోని బింగినపల్లి, మూలగుంటపాడు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది నిర్వహించారు. జిగురు అట్టలు, లింగాకర్షణ బుట్టలు ఏర్పాటు చేసుకోవటం ద్వారా తెగుళ్లను కొంతవరకు నివారించవచ్చని ప్రకృతి వ్యవసాయ సీఆర్‌పీ వెంకటరమణ వివరించారు. ఏఏఓ జహీర్, గ్రామ వ్యవసాయ సహాయకురాలు శ్రీలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.



గోగులపల్లెలో రైతులకు సూచనలిస్తున్న ఏఓ సంపత్‌కుమార్



వరిపైరులో తెగుళ్లను పరిశీలిస్తున్న ఏఓ రాధ



బింగినపల్లిలో వరిపైరును పరిశీలిస్తున్న ఏఓ సుధాకర్

---

# పీహెచ్‌సీలో ముగ్గుల పోటీలు



ముగ్గులు పరిశీలిస్తున్న ఎంఈఓ మెడికల్ అధికారి

హనుమంతునిపాడు: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని స్థానిక పీహెచ్‌సీలో మంగళవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఏఎన్‌ఎంలకు, ఆశావర్కర్లకు, ఎంఎల్‌హెచ్‌పీలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీలో ఆరోగ్య సిబ్బంది పోటాపోటీలతో పాల్గొని ముగ్గులు వేశారు. ముగ్గుల పరిశీలించి విజేతలను ఎంపిక చేశారు. విజేతలకు ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంఈఓ జి.పెద్దిరాజు, మెడికల్ అధికారి దార్ల సందీప్‌కుమార్ బహుమతులు అందజేశారు. సీహెచ్‌ఓ కేవి చెన్నయ్య,సూపర్‌వైజర్లు ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలి



మాట్లాడుతున్న డీఎల్‌డీఓ శ్రీనివాసరెడ్డి

పామూరు: సచివాలయ సిబ్బంది వారివారి సచివాలయ పరిధిలోని అర్హులకు అందేలా చూడాలని డీఎల్‌డీఓ కె.శ్రీనివాసరెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ హాలులో మంగళవారం సచివాలయ సిబ్బందితో సర్వేలు, ఉపాధి హామీ కార్యక్రమంపై సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పథకాలు, సర్వేల్లో అనుసరించాల్సిన తీరుతెన్నులను వివరించారు. తహసీల్దార్ బీవీ రమణారావు, ఎంపీడీఓ బొలినేని సురేష్, ఈఓపీఆర్‌డీ కేఎల్ శ్రీనివాసరావు, ఏపీఓ బి.మాల్యాద్రి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పార్వతి, పద్మజ, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# పాఠశాల అభివృద్ధిలో కీలకపాత్ర వహించాలి



మాట్లాడుతున్న హెచ్‌ఎం రామస్వామి

పామూరు: పాఠశాలల అభివృద్ధిలో పాఠశాల యాజమాన్య కమిటీలది కీలపాత్ర వహించాలని స్థానిక ప్రభుత్వ ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయుడు మెడబలిమి రామస్వామి అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో మంగళవారం ఎస్‌ఎంసీ కమిటీకి శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం రామస్వామి మాట్లాడుతూ బడిఈడు పిల్లలందరినీ పాఠశాలకు వచ్చేలా చేయడం, విద్యార్థుల హాజరుశాతం పెంపు, పాఠశాల అభివృద్ధిలో నిధుల వినియోగం, విద్యార్థులకు మధ్యాహ్నాభోజన పథకం నిర్వహణ, ×సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థిమిత్ర । కిట్ల పంపిణీతో పాటు పాఠశాల అభివృద్ధికి సంబంధించి ప్రతి దానిలో కమిటీ చైర్మన్‌లు, సభ్యులు భాగస్వాములై పర్యవేక్షించాలన్నారు. ఎస్‌ఎంసీ చైర్మన్ గుత్తి కొండలరావు, బొప్పూరి రాజేష్, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

# విద్యార్థులకు పెన్నులు, నోట్‌బుక్స్ పంపిణీ



ఆదర్శ పాఠశాలకు మోటార్ అందచేస్తున్న దాత, విశ్రాంత టీచర్ సింగారెడ్డి

కనిగిరిరూరల్: మోడల్ స్కూల్ అభివృద్ధికి దాతలు చేయూతనందించడం అభినందనీయమని ఎస్‌ఎంసీ కమిటీ చైర్మన్ పందిటి మోహన్ అన్నారు. మోడల్ స్కూల్‌లో నీటి సమస్య పరిష్కారానికి విశ్రాంత టీచర్ వరా సింగారెడ్డి రూ.10వేలు, ఐతా సుబ్బయ్య రూ.5వేలు సాయంతో వాటర్ మోటార్‌ను మంగళవారం అందచేశారు. అనంతరం ప్రిన్సిపాల్ పద్మావతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పందిటి మోహన్ మాట్లాడుతూ సుమారు 550 మంది విద్యార్థులు చదివే పాఠశాలలో నీటి సమస్య పరిష్కారంలో దాతలు భాగస్వామ్యం కావడం అభినందనీయమన్నారు. అనంతరం విద్యార్థులకు పెన్నులు, నోట్ బుక్‌లు సింగారెడ్డి, ఐతా సుబ్బయ్యలు అందచేశారు. ఈ సందర్భంగా దాత సింగారెడ్డిని పాఠశాల ప్రిన్సిపాల్ పద్మావతి, వైస్ ప్రిన్సిపాల్ రమణయ్య, ఉపాధ్యాయులు, తల్లి దండ్రుల కమిటీ ఘనంగా సన్మానించారు.

# చెట్టును ఢీకొన్న ట్రాక్టర్



చెట్టును ఢీకొని ధ్వంసమైన ట్రాక్టర్

జరుగుమల్లి(సింగరాయకొండ): ప్రమాదవశాత్తు ట్రాక్టరు రోడ్డు పక్కన చెట్టును ఢీకొన్న ఘటనలో ఇంజన్ పూర్తిగా ధ్వంసం కాగా ట్రక్కు తిరగబడింది. ఈ సంఘటన మంగళవారం జరుగుమల్లి గ్రామ సమీపంలో జరిగింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు తృటిలో ప్రమాదం తప్పి స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. స్థానికుల కథనం ప్రకారం జరుగుమల్లి మండలం చింతలపాలెం గ్రామానికి చెందిన నల్లమాల మధు ఇసుక లోడ్ తో వెళ్లి తిరిగి గ్రామానికి వెళుతుండగా ఈ ఘటన జరిగింది. ప్రమాదంలో ట్రాక్టర్ ఇంజన్ రెండు ముక్కలైందని, ఇంజన్ ముందు భాగం రెండు టైర్లు విరిగిపడ్డాయని, ట్రక్కు తిరగబడిందని తెలిపారు. డ్రైవర్ మద్యం మత్తులో ఉండటం వల్లనే ఈ ఘటన జరిగిందని స్థానికులు పేర్కొన్నాచారు. ఇటీవల కాలంలో ఈ మార్గంలో ట్రాక్టర్ల హడావుడి ఎక్కువగా ఉందని, డ్రైవర్లు కొంతమంది మద్యం సేవించి వేగంగా నడుపుతున్నారని, పోలీసులు తనిఖీలు చేసి చర్యలు తీసుకోవాలని ప్రజలుకోరుతున్నారు.

# 10న కబడ్డీ పోటీలు

సీఎస్‌పురం(పామూరు): సంక్రాంతి పండుగ సందర్భంగా వైఎస్సార్ సీపీ, ఆళం బాలిరెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని కందుర్లగుంట అగ్రహారంలో ఈనెల 10వ తేదీ నుంచి 13వ తేదీ వరకు నియోజకవర్గ స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న వారు ఈనెల 9వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా ఎంట్రీఫీజు రూ.500 చెల్లించి పేర్లను నమోదుచేసుకోవాలన్నారు. ప్రథమ బహుమతి రూ.20 వేలు, ద్వితీయ బహుమతి రూ.15 వేలు, తృతీయ బహుమతి రూ.10 వేలు అందజేస్తామన్నారు. పోటీలు పోటీలు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. పూర్తి వివరాలకు 9392494205, 8897292746 నంబర్లను సంప్రదించాలని కోరారు.

---

# పెన్షన్ల వెరిఫికేషన్ పరిశీలన



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డీసీహెచ్‌ఎస్ అధికారి సూరిబాబు

కొండపి: మండలంలో జరుగుతున్న పెన్షన్ల వెరిఫికేషన్‌ను డీసీహెచ్‌ఎస్ అధికారి సూరిబాబు మంగళవారం పరిశీలించారు. నూరుశాతం అంగవైకల్యం ఉండి రూ.15 వేల పింఛన్ తీసుకుంటున్న వారి వివరాలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఐదు టీంలు సర్వే చేస్తున్నాయన్నారు. జిల్లాలో 15 వేల పింఛన్ తీసుకుంటున్న వారు 1236 మంది ఉన్నారి, కొండపి మండలంలో 74 మంది ఉండగా రెండు రోజుల్లో 62 మందిని సర్వే చేసినట్లు తెలిపారు. సర్వే నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామన్నారు. అనంతరం స్థానిక ప్రభుత్వ వైద్యశాలను ఆయన తనిఖీ చేశారు. వైద్యశాలలో ఎక్స్‌రే, ఆపరేషన్ థియేటర్‌ను పరిశీలించారు. జనవరి నెల మొత్తం గైనకాలజిస్టు, మత్తు డాక్టర్ అందుబాటులో ఉండారన్నారు. ఆపరేషన్ థియేటర్‌లో లైటింగ్ సక్రమంగా లేదని, మరమ్మతులు చేయాలని వైద్యులకు సూచించారు. కొండపి వైద్యశాలకు డిజిటల్ ఎక్స్‌రే ప్రతిపాదనలు పంపించారని పేర్కొన్నారు. వైద్యశాల అభివృద్ధి జరగాలంటే వైద్యులు రోగులకు అందుబాటులో ఉండాలన్నారు. త్వరలో కొండపి సీహెచ్‌సీలో పోస్టుమార్టం ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ వరలక్ష్మి, ప్రభుత్వ వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

# మృతుని కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం



మృతుని కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందజేస్తున్న నాయకులు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని పెదరాజుపాలెంకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు ప్రవీణ్ (39) ఇటీవల గుండెపోటుతో మృతిచెందాడు. ఈ సందర్భంగా మంగళవారం మృతుని కుటుంబ సభ్యులకు వైఎస్సార్ సీపీ కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ దద్దాల నారాయణయాదవ్ రూ.0 వేల ఆర్థికసాయం ప్రకటించగా సాయం నగదును పార్టీ మండల అధ్యక్షుడు భువనగిరి వెంకటయ్య మృతుని భార్యకు అందజేశారు. మృతుని కుటుంబసభ్యులను ఓదార్చి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట రామిశెట్టి బాబు, వెంకటరాజు, మాధవ, పార్థుయాదవ్ పలువురు పాల్గొన్నారు.

# కిశోర బాలికలకు పౌష్టికాహారం అవసరం

ఉలవపాడు: కిశోర బాలికలకు సంపూర్ణ ఆహారం అందించాలని దాని వలన ఆరోగ్యంగా ఉంటారని కరేడు, చాకిచర్ల వైద్యులు రత్నజ్యోతి, సింధు అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన ఉలవపాడులో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. బాలికలకు పోషకాహారం ఉండాలన్నారు. రుతుస్రావ పరిశుభ్రత గురించి వివరించారు. సీడీపీఓ అరుణకుమారి మాట్లాడుతూ బాలికలకు ఆత్మరక్షణ చాలా ముఖ్యమని ప్రతి ఒక్కరూ ధైర్యంగా ఉండాలన్నారు.

# ఆధార్, రేషన్‌కార్డులు మంజూరు చేయాలి



ఎస్టీ కాలనీవాసులతో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని కందుర్లగుంట అగ్రహారం వద్ద సుమారు 30 కుటుంబాల యానాదులు (ఎస్టీ)లు ఉన్నారని వారిలో అధికశాతం మందికి ఆధార్, రేషన్‌కార్డులు లేవని అధికారులు తక్షణం వారికి ఆధార్, రేషన్‌కార్డులు మంజూరు చేయించి ఆదుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి ఎస్‌కే.పెద్దమస్తాన్ అన్నారు. స్థానిక ఎస్టీకాలనీని మంగళవారం సందర్శించిన ఆయన కాలనీవాసులతో మాట్లాడారు. తమకు నీటి సౌకర్యం, విద్యుత్‌సౌకర్య, కాలనీలు లేవని గుడిసెలు వేసుకుని జీవిస్తున్నారన్నారు. అధికశాతం పలుప్రాంతాల్లో పనులు చేసుకుంటూ ఉంటారని, వారికి జనన ధ్రువీకరణ పత్రం లేకపోవడంతో ఆధార్ తీయడం లేదని దీంతో రేషన్‌కార్డుకూడా పొందలేకపోతున్నారన్నారు.

అధికారులు స్పందించి జనన ధ్రువీకరణ పత్రం లేకపోయినా ఆధార్ కార్డు ఇచ్చేలా తగు చర్యలు చేపట్టి ఆదుకోవాలన్నారు.